## క్లుప్తంగా

### న్యాక్ శిక్షణ కేంద్రం తనిఖీ



భీమ్‌గల్: పట్టణంలో కొనసాగుతున్న న్యాక్ శిక్షణ కేంద్రాన్ని డైరెక్టర్ సత్యపాల్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా శిక్షణ పొందుతున్న వారిని వివరాలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ కేంద్రంలో అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ దిలీప్‌కు సూచించారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రభాకర్, రమేష్, రుచిత, ఓంకార్ ఉన్నారు.

### అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు



బాల్కొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే ఆయన క్షమాపణాలు చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తీన్మార్ మల్లన్న వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. నాయకులు సామ వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి, సురాజ్‌రెడ్డి, అనిల్, మునీరొద్దీన్, గోపాల్ ఉన్నారు.

### హోలీని పసుపుమయం చేయాలి

మోర్తాడ్(బాల్కొండ): అందరు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే హోలీ పండుగను పసుపుమయం చేయాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. రైతుల నుంచి పసుపును కొనుగోలు చేసి హోలీ సంబురాలు జరుపుకోవాలని ఆయన సూచించారు. మోర్తాడ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యానికి పసుపు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ పిలుపును విద్యార్థి, మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు స్వాగతించాలని కోరారు.

### నిధులు మంజూరు



వేల్పూర్: మండలంలో ఎనిమిది గ్రామాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ. 12.40 లక్షల నిధులు మంజూరైనట్లు బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌చంద్ర తెలిపారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, జెడ్పీటీసీ అల్లకొండ భారతి కోటాకింద మంజూరైన నిధుల ఉత్తర్వులను శనివారం ఆయన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేశారు.పచ్చలనడ్కుడలో రామాలయం వద్ద, ఎస్సీ కాలనీలో, వేల్పూర్‌లో సీఎస్‌ఐ చర్చి వద్ద, పడగల్‌లో శివాజీ విగ్రహం వద్ద, అంక్సాపూర్‌లో సంతమల్లన్న కమాన్ వద్ద, లక్కోరలో అంబేద్కర్ విగ్రహం వద్ద, కుకునూర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద, పోచంపల్లిలో గాంధీవిగ్రహం, అమీనాపూర్‌లో లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ నీరడి రాజేశ్వర్ పలువురు లబ్ధిదారురాలుకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. పంచాయతీ పాలక వర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### స్పీకర్‌కు సన్మానం



రుద్రూర్: మండల కేంద్రంలోని రామాలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులు శనివారు బాన్సువాడకు వెళ్లి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన రామలయం పునఃనిర్మాణానికి రూ.40లక్షలు మంజూరు చేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడంతో ఆయనను సన్మానించి, కృతజ్ఞతలు తెలిపామన్నారు. విండో చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ పత్తి రాము, వైస్ ఎంపీపీ సాయిలు తదితరులు ఉన్నారు.

### యువ రచయితకు..

బోధన్: మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన యువకుడు కమ్మరి జ్ఞానేశ్వర్ స్వీయ రచన 'మనం మరిచిన స్వాతంత్ర్య సమరయోధులు' అనే పుస్తకం జాతీయ స్థాయి పుస్తక మేళాకు ఎంపికైంది. ఈసందర్భంగా శనివారం నిజామాబాద్‌లో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్‌సూర్య నారాయణ గుప్త, మేడపాటి ప్రకాష్ రెడ్డిలు జ్ఞానేశ్వర్‌ను సన్మానించారు.

# నిరుపయోగంగా పశువైద్యశాల

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో పశుపెంపకందారులు



బొంకన్‌పల్లిలోని మినీ పశువైద్యశాల

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లిలో ఏర్పాటుచేసిన పశువుల వైద్యశాల నిరుపయోగంగా మారింది. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో మూగజీవాలకు, శరణార్థులకు నిలయంగా మారింది. దీంతో మండలంలోని ముల్లంగి (బి), బొంకన్‌పల్లి గ్రామాల పశువుల, గొర్రె, మేకల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**2003లో వైద్యశాల ఏర్పాటు..**

ముల్లంగి (బి), బొంకన్‌పల్లి గ్రామాల పశువుల, గొర్రె, మేకల పెంపకందారుల ప్రతిపాదన మేరకు బొంకన్‌పల్లిలో పశువైద్యశాల ఏర్పాటు కోసం 2003లో అప్పటి రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు జన్మభూమి నిధుల నుంచి సుమారు రూ. 10లక్షలు నిధులు ఇప్పించారు. మిగితా డబ్బులను రెండు గ్రామాల రైతులు పోగు చేసి ఆస్పత్రి భవనంను నిర్మించారు.

ప్రారంభంలో పశువైద్యులు ఇక్కడి పశువైద్యశాలకు వచ్చి పశువులకు వైద్యం చేసేవారు. కాలక్రమేనా ఈ ఆస్పత్రిని తెరిచేవారు లేకుండా పోయారంటూ గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాల్లో సుమారు 200కు పైగా పాడి గేదేలు, 2వేలకు పైగా గొర్రె,, మేకలు ఉన్నాయి. అయినా అధికారులెవరూ పశువైద్యశాలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబందిత శాఖ అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన పశువైద్యశాలను ఉపయోగంలోకి తీసుకువచ్చి, పశువులకు వైద్యం అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు స్పందించాలి..**



బొంకన్‌పల్లి పశువైద్యశాలను కొన్ని సంవత్సరాలుగా తీయటం లేదు. ఫలితంగా భవనం కుక్కలకు, బిక్షగాళ్లకు నిలయంగా మారింది. ఈ విషయమై మండల పశువైద్యులను సంప్రదిస్తే మాకు సంబంధం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువుల ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి.

–ప్రమోద్, పాడిరైతు, బొంకన్‌పల్లి

**గ్రామానికే వెళ్లి వైద్యం అందిస్తున్నాం..**

బొంకన్‌పల్లి పశు వైద్యశాలను గోపాలమిత్ర సిబ్బంది ఉపయోగించాల్సి ఉంటుంది. మేము మండలంలోని అన్ని గ్రామాల పశువులు, గొర్రె, మేకల పెంపకందారులకు అందుబాటులో ఉంటాం. అలాగే అవసరమైన ప్రతిసారి ఆయా గ్రామానికి వెళ్లి రోగాల బారిన పడ్డ పశువులకు వైద్యం చేస్తున్నాం. పాడిరైతు ఏ రాత్రి ఫోన్ చేసినా, వైద్యం అందిస్తున్నాం.

–కిరణ్‌దేశ్‌పాండే,
మండల పశువైద్యాధికారి, మాక్లూర్

# నా జీవితం నియోజకవర్గానికే అంకితం





అంకాపూర్‌లో పలువురిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే.. రోగులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికే నా జీవితాన్ని అంకితం చేస్తానని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్, బీజేపీలను మట్టికరిపించడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు పూజ నరేందర్, సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, భూషణ్, పండిత్ పవన్ పాల్గొన్నారు.

**కిడ్నీ పేషంట్లకు డయాలసిస్ సెంటర్ వరం..**

ఆర్మూర్: ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ప్రారంభించిన డయాలసిస్ సెంటర్ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు వరంలాంటిదని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. నమస్తే ఆర్మూర్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవించిన వారికి కేసీఆర్ కిట్లను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, ఎల్‌వోసీ, సీఎం రిలీఫ్‌ఫండ్ అవసరమైనవారు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు, వైద్యులు ఉన్నారు.

**స్థలం, నిధులు కేటాయిస్తా..**

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్వర్ణకార సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి రూ.15 లక్షల నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శనివారం హామీ ఇచ్చారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని స్వర్ణకార సంఘం సభ్యులు కలిసి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వంటగ్యాస్ ధరలను తగ్గించాలి



నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ ప్రతినిధులు

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు గోదావరి డిమాండ్‌చేశారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో ఆమె పట్టణంలో శనివారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిత్యవసర సరుకుల ధరలు పెంచుతూ పేదల నడ్డి విరుస్తుందని ఆరోపించారు. ధరలు తగ్గించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యక్క, డివిజన్ అధ్యక్షురాలు రమా, సహాయ కార్యదర్శి పుష్పలత, పద్మ పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

బాల్కొండ: మెండోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రణీత్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో శనివారం విద్యార్థిని హెచ్‌ఎం ఆరాధన, ఉపాధ్యాయులు సన్మానించారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గణేష్, పెర్కిట్ నారాయణ పాఠశాలకు చెందిన అభినయ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంలు అభినందించారు.

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని విజయసాయి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. గతేడాది ఎస్సెస్సీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. చాణక్య, మిత్ర కంపెనీ డెవలప్ అనాలిసిస్ట్ సాయిదీపి, జాన్‌డీర్ కంపనీ మెకానికల్ ఇంజనీర్ సాయి అమిత్, పాఠశాల పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

### హరితహారం వృక్షాల పరిశీలన



మాక్లూర్: మండలంలోని ముత్యంపల్లి, సట్లాపూర్ తండాలలో హరితహారం వృక్షాలను శనివారం కేంద్రబృందం సభ్యులు నందకుమార్, ధన్‌రాజ్ పరిశీలించారు. ప్రధానంగా 2015, 2016లో హరితహారం కింద నాటిన చెట్లను ఏ మేరకు పెంచారు. ఎలా సంరక్షించారు అనే విషయాలన్నింటిని క్షుణంగా పర్యవేక్షించారు. చెట్లను సంరక్షించిన విధానంపై కేంద్రబృందం సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం కేంద్ర బృందం అధికారులను ఎంపీడీవో క్రాంతి సన్మానించారు. ఏపీఎం ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం

**నేడు గురుకుల ప్రవేశ పరీక్షలు**

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (సీవోఈ)లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మండలంలోని ధర్మారం (బి) గురుకుల కళాశాలలో ఆదివారం సీవోఈ సెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం1గంటవరకు ఉంటుందన్నారు.

**మధ్యాహ్నం డిగ్రీ ప్రవేశ పరీక్ష**

తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ధర్మారం(బి) గురుకుల కళాశాలలోని పరీక్షా కేంద్రంలో టీజీయూజీసెట్–2023 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు.

**నేడు రుద్రూర్‌లో మట్టిస్నానం**

రుద్రూర్: మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో ఆదివారం మట్టి స్నానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సభ్యులు విశ్వనాథ్ మహజన్, లక్ష్మీ నర్సయ్య, మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గం. నుంచి గంటన్నర పాటు కార్యక్రమం ఉంటుందన్నారు. అసక్తి ఉన్నవారు యోగా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

### పట్టుదల, క్రమశిక్షణతో చదవాలి



బోధన్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. పట్టణంలోని బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్‌కాంప్లెక్స్ స్థాయి స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో నాగ్‌నాథ్, ఎఫ్‌ఎల్‌ఎన్ మండల అధికారి నాగయ్య, హెచ్‌ఎం ఆర్‌వీఎస్ గౌడ్ పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి



బోధన్: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో కీలక విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన ఉండాలని బోధన్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టులో శనివారం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతినెల మొదటి శనివారం చట్టాలపై అవగాహన సదస్సు ఉంటుందని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్‌ఐలు నవీన్, నరేష్, సందీప్‌లు ఎస్సైలు సాయన్న, ఆనంద్‌సాగర్, ఏఎస్‌ఐలు ఇలియాస్, రాజు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్..

### రహదారిపై వృథాగా నీరు



రుద్రూర్: మండల కేంద్రంలో గ్రామంలోకి వెళ్లె ప్రధాన రహదారిలో ఉన్న బోరు నుంచి నీరు లీకేజీ అవుతోంది. దీంతో రోడ్డుపై నుంచి నీరు వృథాగా ప్రవహిస్తుంది. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన స్పందించి రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు వృథాకాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: భాస్కర్, జీపీ ఇన్‌చార్జి కార్యదర్శి, రుద్రూర్

ఫోన్ నంబర్ : 9490174206

## ఆధ్యాత్మికం

**ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం**



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో శనివారం గంగపుత్రసంఘం ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల సమక్షంలో భక్తులు ఉదయం రామాలయం నుంచి గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనర్సింహాస్వామి రథోత్సవం నిర్వహించారు.

**లింగంగుట్టలో ప్రత్యేక పూజలు**

నవీపేట(బోధన్): నవీపేట శివారులోని లింగంగుట్టలో శనివారం శని త్రయోదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాజయోగి సిద్దేశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో శనిదేవుడికి తైల, పంచామృతాభిషేకం, శని హోమం, అష్టమ అర్ధాష్టమ ఏలినాటి శనిదోష నివారణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**వితలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు**



రుద్రూర్: రుద్రూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వితలేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాష్ట్ర సచివాలయ పర్యాటక, సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి కె రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రామశర్మ ఆయనకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆయన స్వగ్రామం రుద్రూర్‌లో ఆలయాన్ని సందర్శించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రమేష్‌ను సత్కరించారు. నారాయణరావు కులకర్ణి, వీరేశం, సాయిలు, అశోక్, కొలాస్ గంగాధర్, డౌర్ సాయిలు, వంజరి బాపురావ్, వీరయ్య ఉన్నారు.

# మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి



నెహ్రూనగర్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీడీపీవో జానకి



చందూర్‌లో మాట్లాడుతున్న అధికారులు



మాక్లూర్‌లో..

ఎడపల్లి(బోధన్): సమాజంలో మహిళలపై అఘాయిత్యాలను, బాల్యవివాహాలను అరికట్టాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోధన్ సీడీపీవో జానకి పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మహిళలకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని ఉపయోగించుకొని ముందడుగు వేయాలన్నారు. మండల పర్యవేక్షకురాలు వినోద మాట్లాడుతూ... మహిళలు చదువులో రాణిస్తే కుటుంబాలు బాగుపడతాయన్నారు. అనంతరం పలు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ అమానుల్లా, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మహిళా చట్టాలు, సఖీ కేంద్రం, హెల్ప్‌లైన్ గూర్చి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అవగాహన కల్పించారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, మహిళలు హక్కులపై అవగాహన ఉండాలన్నారు.

మాక్లూర్: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మహిళ దినోత్సవం సందర్భంగా శనివారం ఐసీడీఎస్ ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, రైటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. పర్యవేక్షకులు వరలక్ష్మి మాట్లాడుతూ.. బాలికలకు హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్లు, చైల్డ్ లైన్ 1098,100 ఎలా ఉపయోగించుకోవాలో తెలిపారు. ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

### వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాక్లూర్: విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)ను శనివారం ఆయన తనిఖీ చేశారు. అలాగే పదో తరగతి విద్యార్థుల ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రత్యేకాధికారి ప్రగతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: బోధన్ ప్రత్యేక జిల్లా కోసం పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 76వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, శ్రవణ్ కుమార్, న్యాయవాదుల గుమస్తాల సంఘం ప్రతినిధి సందీప్‌లు కూర్చున్నారు.



## సంక్షిప్తం

**సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామంలో శనివారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ ప్రారంభించారు. వైస్ ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న, సర్పంచ్ మట్ట సందీప్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**సోలార్ ప్లాంట్ తనిఖీ**

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని మీనార్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలర్ ప్లాంట్‌ను శనివారం టీ సెర్ప్ డీజీఎం వేణుగోపాల్ (హైదరాబాద్) పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీ సెర్ప్ సహకరంతో స్త్రీనిధి రుణాలతో గ్రామాల్లో సోలర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ సంఘాల సభ్యులు ముందుకురావాలని కోరారు. ఏపీఎం గంగారాం, స్త్రీనిధి మేనేజర్ రాధా ఉన్నారు.

**సైన్స్‌పై అవగాహన సదస్సు**

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ విద్యార్థులకు సైన్సు గురించి ప్రయోగాత్మకంగా వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రీ ప్రైమరి పాఠశాల విద్యార్థులకు ఫ్లవర్స్‌డే నిర్వహించారు.

**భూమాగౌడ్‌కు ఘన నివాళి**

రుద్రూర్: కోటగిరిలో శనివారం దివంగత బొజ్జ భూమగౌడ్ వర్ధంతి సందర్భంగా గీతా పనివార సంఘం నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. గీత కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేసిన నాయకుడన్నారు.

**అలరించిన సైన్స్‌ఫేర్**

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన సైన్స్‌ఫేర్ ఎంతగానో అలరించింది. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు రూపొందించిన ప్రయోగాల పనితీరును పరిశీలించారు. కౌన్సిలర్లు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

**అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు**



నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఐలాపూర్ గ్రామంలో మూడురోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన అనాథ వృద్ధురాలు శాంతాబాయికి (85) శనివారం గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. కోలాపురం కేశవ్, భార్య శాంతాబాయిలు 60ఏళ్ల క్రితం గ్రామానికి వచ్చారు. వీరికి సంతానం లేదు. కాగా కేశవ్ గ్రామంలోని ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేశాడు. దీంతో ఆయన సేవలను గ్రామస్తులు గుర్తుంచుకొని ఆయన మృతిచెందగానే అతని భార్య శాంతాబాయిని అక్కున చేర్చుకున్నారు. ఆమె బాగోగులు చూసుకునే అన్నపూర్ణమ్మ తలకొరివి పెట్టింది. గ్రామస్తులందరూ కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.